

నిమ్స్‌లో నో బెడ్స్..!

-ఫైరవీ లేనిదే బెడ్లు దొరకవు

-ఎమర్జెన్సీలో గంటల కొద్దీ నిరీక్షణ

-ఓపీ విభాగంలో భారీ క్యూలైన్లు

-కష్టం మీద ఓపి కార్డు తీసుకున్నా వైద్యులను కలిసేలోపు పూర్తవుతున్న సమయం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

నిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో బోడ్లు దొరకక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగి కండీషన్ ఎంత సీరియస్‌గా ఉన్నా ఫైరవీ లేనిదే బెడ్లు దొరకని పరిస్థితి నెలకొంది. రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు ఇలా ఎవరో ఒకరు సిఫారస్ చేస్తే గానీ రోగులను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎన్ని విమర్శలు వచ్చినా నిమ్స్ తీరు మారడం లేదని బాధిత రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేదల కార్పొరేట్ ఆస్పత్రిగా పేరున్న నిమ్స్‌లో వైద్య సేవల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, రుమటాలజీ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాల్లో వైద్యం కోసం వచ్చే రోగులు ఓపి కార్డు తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. ఇక నిమ్స్ జనరల్ ఎమర్జెన్సీకి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజూ జిల్లాల నుంచి 30 నుంచి 50 మందికి పైగానే వస్తుంటారు. వచ్చే కేసులన్నీ అత్యవసరమైనవే. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు, గుండెపోటు, పక్షవాతం వచ్చిన రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. వారి పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో నిమ్స్‌కే తరలిస్తారు. వీరందరికి వెంటనే పడక ఏర్పాటు చేయడం కష్టమవుతుంది. మరో వైపు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులను పెద్దగా చేర్చుకోవడం లేదు. దీంతో చాలా కేసులు నిమ్స్‌కే వస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు పడకలు దొరకడం లేదు. దీంతో అత్యవసర బ్లాక్ ముందు అంబులెన్స్‌లు, కార్లలో రోగులను తీసుకొని వచ్చి పడిగాపులు కాస్తున్నారు. గంటల కొద్దీ బాధితులు అత్యవసర బ్లాక్ ముందు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు, మూడు గంటలు గడిస్తేకానీ అక్కడ పడక దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రోగి ఎంత సీరియస్‌గా ఉన్నా అర్ధరాత్రి వేళ ఆసుపత్రికి వచ్చినా చికిత్స సంగతి పక్కన పెడితే అసలు బెడ్ దొరకడమే సమస్యగా మారింది. ఎంత అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా ముందుగా వినిపించే మాట.. ఇక్కడ పడకలు లేవు అనే. ఎమర్జెన్సీ వార్డులో ఓ రోగి ఖాళీ అయితేనే మరో రోగికి పడక దొరికే పరిస్థితి ఉంది. దీంతో రోగులను ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్స్ జనరల్ ఎమర్జెన్సీలో పడకలు రోగుల అవసరాల మేరకు సరిపోవడం లేదు. ఈ విభాగం గ్రౌండ్ ఫ్లోరులో 40 పడకలు, మొదటి అంతస్తులో 50 పడకలు ఉన్నాయి. 18 వరకు ట్రాలీలు ఉంటాయి. అయితే అత్యవసర విభాగానికి రోజుకు రెట్టింపు సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఇక్కడికి వచ్చే రోగుల పరిస్థితి బట్టి సర్జికల్, మెడికల్, క్రిటికల్, న్యూరో, కార్డియాలజీ ఇలా పలు విభాగాలకు వెంట వెంటనే తరలించాలి. అయితే కొన్నిసార్లు వ్యాధి నిర్ధారణ చేయడంలో ఆలస్యం జరుగుతుండటంతో రోగులు రెండు, మూడు రోజుల వరకు ఎమర్జెన్సీలోనే ఉండాల్సి వస్తుంది. దీంతో కొత్తగా వచ్చేవారికి పడకలు దొరకడం లేదు. అత్యవసర విభాగంలోనికి ప్రవేశం లభించినా ట్రాలీలోనే గంటల పాటు ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ విభాగం నుంచి ఓ రోగిని పంపిస్తేనే మరొకరికి పడక దొరికే అవకాశం ఉంటుంది. జనరల్ ఎమర్జెన్సీకి రోగులు అనేక రకాల సమస్యలతో వస్తున్నారు. వారికి ఏ వైద్యుడు చికిత్స అందించాలనే అంశం తెలవక పోవడంతో రోగులు ఒకటి రెండు రోజులు అలాగే ఉంటున్నారు. నిజానికి ఎమర్జెన్సీకి వచ్చిన రోగిని నాలుగైదు గంటల్లో సంబంధించి వార్డుకు తరలించాలి. కానీ ఆసుపత్రి వర్గాల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇక ఓపి విభాగం పరిస్థితి అదే విధంగా ఉంది. రోగులు ఓపి కార్డు తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాలి. అతి కష్టం మీద ఓపి కార్డు తీసుకున్నా వైద్యులను కలిసేలోపు సమయం అయిపోతుంది. దీంతో నిమ్స్‌లో వైద్య సదుపాయం పొందాలంటే గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

దీనిపై రోగుల బాధలు పట్టించుకునేవారులేకుండా పోయారు.

హైదరాబాద్ వార్త

రూ.లక్షల్లో ఫీజులు..ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

✦ సినిమా టికెట్ల తరహాలో అడ్వాన్స్ బుకింగ్ ✦ విద్యావ్యవస్థలో దాపురించిన సీట్ల బ్లాక్ చేసుకునే దుస్థితి

✦ 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందు కార్పొరేట్ కళాశాలలో సీట్ల దందా

✦ తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు ✦ పట్టించుకోని ఇంటర్మీడియట్ బోర్డు ✦ చర్యలకు విద్యార్థి సంఘాల డిమాండ్

హైదరాబాద్ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే కార్పొరేట్ కళాశాలల నిబంధనలను విరుద్ధంగా ఇంటర్మీడియేట్ ప్రవేశాల్లో కార్పొరేట్ కళాశాలల మాయమొదలైంది. పదవ తరగతి పరీక్షలు వచ్చే నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ప్రారంభంకాకముందే నగరంలోని పలు ప్రైవేట్ కళాశాలలు 2024-2025 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు 90శాతం పూర్తవడం సంబంధిత అధికారులను కూడా కలవర పెట్టడంతో పాటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌మొదటి సంవత్సరం పూర్తయిపోతున్నాయంటూ విద్యార్థులకు తీవ్రంగా కలవరపెట్టి మరీ కళాశాలల నిర్వాహకులు కృత్రిమ డిమాండ్ సృష్టించి సీట్ల పేరుతో కాసులను దండుకుంటున్నారు. సినిమా టికెట్ల తరహాలో ప్రైవేట్ కళాశాలల్లో కూడా అడ్వాన్స్ బుకింగ్ పేరుతో సీట్లు బ్లాక్ చేసుకునే పరిస్థితి విద్యావ్యవస్థలో కూడా దాపురించింది. ఈ విధంగా జరగడానికి గల ప్రధాన కారణంగా విద్యాశాఖ అధికారుల అలసత్వం, నిఘాలోపం, పర్యవేక్షణ లేని కారణంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఈ విధంగా తమ ఇష్టాను రాజ్యంగా వ్యవహరిస్తోందని పలువురు గుసగుసలుపోతున్నారు. ఈ ఏడాది ఇంకా పదవ తరగతి పరీక్షలు ప్రారంభంకాకముందే, ఇంటర్ విద్యకు వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడకముందే కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టాయి. ఈ విధంగా చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని, అధికారులు ఇటువంటి చర్యలను చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేట్ కళాశాలల రాయితీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వలవేస్తూ ముందస్తు 'సీట్ల' దందాకు తెరతీశారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో ఇంటర్ కళాశాలలు ఈ నెలలోనే అడ్మిషన్లు ప్రారంభించడం జరిగింది. వివిధ ప్రసార మాధ్యమాలు, పోస్టర్లు, కరపత్రాలలతో ప్రచారాన్ని ఉధృతంచేసి మరీ ప్రచారాన్ని నిర్వహించాయి. పదవ తరగతి పరీక్షలు పూర్తికాక ముందే ప్రైవేట్ కళాశాలల్లో 2024-25 అకాడమిక్ ఇయర్‌కు ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్‌లు ప్రారంభించింది. ఆయా కళాశాలల పిఆర్‌ఓలతో రోజూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తూ మరీ అడ్మిషన్లపై కేంద్రీకరిస్తున్నారు. ముందుగా అడ్మిషన్‌లు తీసుకుంటేనే ఫీజుల్లో రాయితీ ఉంటుందని, పదవతరగతి ఫలితాల తర్వాత ఈ రాయితీ ఉండదంటూ మరీ చెప్పి ఒక్కింత ఆందోళనకు గురిచేసే విధంగా ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు వ్యవహరిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే కనుక సీటును బుక్ చేసుకోకుంటే ఫీజు తగ్గించడం కుదరదని, కళాశాల యాజమాన్యాలు డిమాండ్‌ను సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాలలో బైపీసీ (నీట్)కు సీట్లు ఇప్పటికే నిండిపోయాయి. అడ్వాన్స్‌డ్ బుకింగ్ పేరిట తల్లిదండ్రుల నుంచి రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు కార్పొరేట్ కళాశాలలు వసూలు చేస్తున్నాయి. మంచి కళాశాల బ్రాంచిల్లో సీట్లు దొరకవేమోనన్న భయంతో తల్లిదండ్రులు కళాశాలల యాజమాన్యాలు అడిగినంత డబ్బును చెల్లించి వారి పిల్లలకు సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. ఈ ప్రైవేట్ కళాశాలల సీట్ల దందాను అరికట్టాలని ఇంటర్‌బోర్డు అధికారులను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాగా ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 16వరకు వరకు నిర్వహిస్తారు. ఈ నెలలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలన్నీ కలెక్టరేట్‌కు తరలించండి

కలెక్టరేట్‌లోని కార్యాలయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

-ప్రతికార్యాలయంలో పరిశుభ్రత పాటించండి

-వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

హైదరాబాద్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:

వివిధ ప్రాంతాల్లో ఉన్న జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాలను లక్డీకపూల్‌లోని కలెక్టరేట్‌లోకి తరలించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం సమావేశమందిరంలో కలెక్టరేట్ నిర్వాహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నివిభాగాల అధిపతులు తమతమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రతిరోజు తమ కార్యాలయాల గదులు, ప్రాంగణాలను పరిశీలించి పరిశుభ్రమైన స్థితిలో ఉంచాలని, స్టిక్కర్లు, పోస్టర్లు తొలగించాలన్నారు. కార్యాలయాల ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా అందంగా తీర్చిదిద్దాలన్నారు. పనికిరాని స్క్రాప్‌ను తొలగించి, పార్కింగ్‌లో వాహనాలను క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. అలాగే వాహనాల వద్ద ఉన్న చెత్తను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం బిల్డింగ్‌లోని అన్ని కార్యాలయాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో జిల్లా అధకారులు సిపివో ఎన్.సురేందర్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మీ, డిబిసిడిఓ ఆశన్నా, డిఎస్‌వోఆర్ కేశవులు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కె.రమేష్, డిడబ్లూవో నాగేశ్వర్‌రావు, నర్సింహ్మారావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించేలా పోలీస్ విధులుండాలి

-రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించేలా పోలీస్ విధులుండాలని రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి సూచించారు. గురువారం అంబర్‌పేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ శిభిరాన్ని అయన ముఖ్య అతిథులుగా హైజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకు విభిన్న నేరాలు చోటు చేసుకుని పోలీసులకు సవాలుగా మారుతున్నాయని చెప్పారు. వాటిని అదిగమించేలా శిక్షణ పొందాలని సూచించారు. పోలీస్ విభాగానికి రావాలని ఎంతో మంది యువత కలలు కంటారని అలాంటి కళలను మీరు సాకారం చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు పోలీస్ ఉద్యోగాలకు చాలా తేడా ఉంటుందన్నారు. సమాజంలో పోలీసులు పాత్ర ఎంతో కీలకమన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని శిక్షణ పొంది ఉత్తమ పోలీసుగా శిక్షణ పొంది రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ పి.మధుకర్ స్వామి మాట్లాడుతూ 9నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు అన్ని అంశాల్లో ఉత్తమ శిక్షణ అందిస్తామని చెప్పారు. రెండు సెమిస్టార్‌లుగా విభజించి నేరాల పట్ల సమగ్ర శిక్షణ అందిస్తామని చెప్పారు. 30 సంవత్సరాల పాటు చేసే ఉద్యోగానికి సరిపడా శిక్షణ ఈ తొమ్మిది నెలల కాలంలో అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీలు పిచ్చయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, మధన్ మోహన్, ఇన్స్‌పెక్టర్లు వెంకట్ రెడ్డి, శ్రీనివవాస్, శ్రీశైలం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ బిగ్‌బాస్ ఫేం షణ్ముఖ్

నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

బిగ్‌బాస్ ఫేం, యూట్యూబర్ గంజాయితీ పట్టుబడ్డాడు. ఇతడి వద్ద నుంచి 16.గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకొని, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ రమణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో గంజాయి ఉందన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు ఆ ఇంటికి వెళ్లి చూడగా బిగ్‌బాస్ ఫేం, యూట్యూబర్ షణ్ముఖ్ కనిపించాడు. అతడి గదిలో వెతికితే 16.గ్రాముల గంజాయి లభిచింది. దీంతో నార్సింగి పోలీసులు అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో షణ్ముఖ్‌ను మళ్లీ విచారిస్తామని, ఇతడికి గంజాయి ఎక్కడ నుంచి వస్తుంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? అన్న పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ రమణాగౌడ్ తెలిపారు.

దొంగలు ముఠా సభ్యులకు రిమాండ్

-బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

అల్వాల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

తాళం వేసిన ఇళ్ళు లక్ష్యంగా వరస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అల్వాల్ పోలీసులు కటకటాలు వెనుకకు నెట్టారు. రిమాండ్‌కు సంబంధించి అల్వాల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేట్‌బహీర్‌బాద్ ఏసీపీ రాములు వివరించారు. నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన కార్ పెయింటర్ బండ విజయ్ కుమార్(28), కుషాయిగుడాకు చెందిన విద్యార్థి సురసుర క్రిష్ణ వంశి(26), అల్వాల్ వాస్తవ్యుడైన కూరగాయలు వ్యాపారి చిగుర్ల సతీష్(30)తో పాటుగా పారీలో ఉన్న తేజ, శ్రవణ్‌లు నాలుగు క్రితం పరిచయం అయ్యారు. జల్సాలకు అలవాటు పడిన వీరు డబ్బు సంపాదనం కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. నగరంలోని వివిధ పోలీసు స్టేషన్‌లు పరిధిలో వరస దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలుగా మారారు. నిందితులు కారు అద్దెకు తీసుకుని పగలు సమయంలో వివిధ ప్రాంతాలులో రెక్కీ నిర్వహించే వారు. తాళాలు వేసిన ఇళ్ళను గుర్తించి రాత్రి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. దొంగతనం చేసే సమయంలో ఇంటికి కొద్ది దూరంలో కారును నిలిపి దానిలో సతీష్ ఉండేవాడు. విజయ్‌కుమార్, క్రిష్ణ వంశీలు డోర్‌లను కట్ చేసే హ్యాండ్ మిషన్‌లుతో తాళాలు పగలు కొట్టి ఇంటిలోపలికి వెళ్ళి సొత్తును దొంగలించే వారు. గత ఏడాది నవంబరులో చర్లపలి, బిఎన్ రెడ్డి కాలనీలో దొంగతనం చేసి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్ళారు. దొంగిలించిన సొత్తులో కొంత బంగారాన్ని అమ్మి గోవాలో జల్సాలు చేయడం జరిగింది. అల్వాల్, జవహర్‌నగర్ పోలీసు స్టేషన్లు పరిధిలో ఐదు దొంగతనాలకు ఈ ముఠా పాల్పడింది. ఈ నెల 16వ తేదీన అల్వాల్ ప్రశాంత్ నగర్‌లో ఈ ముఠా దొంగనం చేశారు. ఈ నెల 21వ తేదీన అల్వాల్, మచ్చబొల్లారం ప్రాంతాలులో అనుమానంగా తిరుగుతున్న స్విఫ్ట్ కారును పోలీసులు తనిఖీ చేయగా దొంగలు ముఠా ఉదంతం వెలుగులోకి వచ్చింది. కారులోని 32.6 తులాలు బంగారం, 4 కెజీలు వెంటి ఆభరణాలుతో పాటుగా ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులులో శ్రవణ్, తేజలు పారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యహరించిన అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ నేతృత్వంలోని డిటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ కానిస్టేబుళ్ళు విద్యాకర్ రావు, గౌస్‌పాషా, రమాకాంత్, రాజశేఖర్, సుధాకర్‌లను ఏసీపీ రాములు అభినందించారు.

మానవ రక్తంతో వ్యాపారం

-నగరంలో రెచ్చిపోతున్న బ్లడ్,ప్లాస్మా మాఫియా

-దాతల నుంచి సేకరించి స్టోరేజ్

-కృత్రిక కొరత సృష్టించి అధికరేట్లకు విక్రయం

-డిసిప దాడుల్లోకి వెలుగులోకి అక్రమాలు

హైదరాబాద్,ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

నగరంలో మెడికల్ మాఫియా రెచ్చిపోతుంది. పేదల రక్తాన్ని వదలకుండా అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు బ్లడ్‌తోపాటు ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈరక్తపిశాచులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో డ్రడగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఏ) అధికారులు అప్రమత్తమై అనుమానం ఉన్న బ్లడ్‌బ్యాంకులపై గత పదిరోజులుగా దాడులు నిర్వహిస్తున్నారు. నిబంధలను విరుద్ధంగా నడుస్తున్న బ్లడ్ బ్యాంక్‌లకు సీజ్ చేయడంతోపాటు నోటిసులు ఇచ్చి కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దుచేస్తున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, బ్లడ్‌బ్యాంకుల్లో ఈదారుణాలు పెరిగిపోతున్నాయి. పేదల ప్రాణాలు లెక్కచేయకుండా డబ్బులే లక్ష్యంగా మానవత్వాన్ని మరిచి ప్రవర్తిస్తున్నారు. దాతల నుంచి సేకరించిన బ్లడ్, ప్లాస్మాను అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో ఐపిఎం సహా 76 ప్రభుత్వ ,ప్రైవేట్,ఎన్జీవో బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు బర్త్‌డేలపేరుతో కాలేజీలు, కార్పొరేటర్ కంపెనీలు, ఇతర ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఈనేపథ్యంలో అపదలో ఉన్న రోగులను కాపాడలనే ఉద్దేశ్యంతో చాలామంది తమ రక్తాన్ని దానం చేసేందుకు ముందు వస్తుంటారు. అయితే దాతల నుంచి సేకరించిన రక్తన్ని ప్రాసెస్ చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రోగులకు అందజేయాల్సి ఉంది. కానీ నగరంలోని బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. దాతలు నుంచి సేకరించిన రక్తంలో 3శాతం ఉస్మానియా, గాంధీ, నీలోఫర్, ఎంఎన్‌జే సహా ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా అందజేయాలని నిబంధన ఉంది. కానీ నగరంలోని బ్లడ్‌బ్యాంకుల నిర్వాహాకలు దీన్ని పట్టించుకోవడం లేదు.

నిల్వలు పెట్టి ..కృత్రిమ కొరత సృష్టించి ..

రోడ్డు ప్రమాదాల్లో గాపపడ్డ క్షతగాత్రులకు, గర్భిణీలకు ప్రసావాలతోపాటు పలు సర్జరీల్లో రక్తస్రావం అధికంగా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో వారికి ఆయా గ్రూపుల రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. అలాగే డెంగీ వంటి జర్వరంతో బాధపడేవవారికి తెల్లరక్తకణాలు ఎక్కించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో రోగుల బంధువుల నమూనాలు తీసుకుని సమీపంలోని బ్లెడ్‌బ్యాంకులను ఆశ్రయిస్తుంటారు. ఈనేపథ్యంలో రోగుల బందువుల వద్ద నిర్వాహాకులు వారు అడిగిన రక్తం లేదని వేరే బ్లడ్‌బ్యాంక్‌నుంచి తెప్పిస్తే అధిక ధరలు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో చేసేదేమి లేక వారు అడిగినకాడికి చెల్లించి బాధితులు రక్తం, ప్లాస్మాను విక్రయిస్తున్నారు.

ఆకస్మిక తనిఖీలు..నోటీసులు..లైసెన్స్ రద్దు

నగరంలోని పలు బ్లడ్‌బ్యాంకుల్లో డ్రగ్ కంట్రోల్ అదికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని 9బ్లడ్‌బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. ప్లేట్‌లెట్స్, ప్లాస్మా, నిల్వ, రక్త సేకరణ పరీక్షల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించింది. మలక్‌పేట్, చైతన్యపురి, లక్డీకపూల్, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్ ,మెహదీపట్నం, బాలానగర్, ఉప్పల్ ప్రాంతాల్లోని బ్లడ్ బ్యాంకులల్లో తనిఖీలు నిర్వహించి నిర్వాహణ లోపాలు గుర్తించి నోటీలు అందజేశారు. అలాగే ఇటీవల డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మూసాపేట్‌లోని హీమో సర్వీసెస్ లాబరేటరీలో తనిఖీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సామర్థ్యానికి మించి నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే నిర్వాహాకులు ప్లాస్మాను నిల్వ చేసి అధిక ధరలకు విఝ్రయిస్తున్నట్లు నిర్ధారించారు. ఈఅక్రమాల్లో భాగస్వామి ఉన్న మియాపూర్‌లోని శ్రీకర ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ సహా, దారుసిఫాలోని న్యూలైఫ్ ఎడ్యూకేషన్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల లైసెన్స్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త

అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ంగా వ్యవహరిస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం ఆయన సతన్‌నగర్ బస్టాండ్ సమీపంలోని గ్రౌండ్ పరిసరాలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలవేయడం వలన రాత్రి వేళల్లో మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు విన్నవించారు. అంతేకాకుండా వారాంతపు సంతలో భాగంగా గ్రౌండ్‌లోపల కూడా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన ఆయన గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడానికి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 64సంవత్సరాలలో జరగని అభివృద్ధిని తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన 10 సంవత్సరాలలో చేసి చూపించామని గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా తాను నిరంతరం కృషి చేశానని తెలిపారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులను మంజూరు చేసిందని, వాటిలో అనేక పనులు టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ం ప్రదర్శిస్తుందని ధ్వజమెత్తారు. నెలరోజులపాటు వేచి చూస్తామని ఆ తరువాత కార్యచరణతో ప్రజాక్షేతంలోకి వెళ్ళి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పోరేటర్ కొలను లక్ష్మీ, ఈఈ ఇందిర, డిఈ మోహన్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఎలక్ట్రికల్ డిఈ అమర్‌నాథ్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, నాయకులు రాజేష్, నోమాన్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది

- వేణుగోపాల్ స్వామి దీమా

సికింద్రాబాద్ భారత్ జూడో న్యాయ్ యాత్రను ప్రారంభించిన కాంగ్రెస్ నేత వేణుగోపాల్ స్వామి తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నేత సి.ఏ. వేణుగోపాల్ స్వామి దీమా వ్యక్తం చేశారు. గురువారం పరేడ్ గ్రౌండ్ నుంచి మెట్టుగూడ చౌరస్తా వరకు నిర్వహించిన భారత్ జూడో న్యాయ్ యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 యేండ్ల బిజెపి పాలనలో దేశంలో అభివృద్ధి జరగలేదన్నారు. రాముడి పేరును అడ్డం పెట్టుకొని బిజెపి లబ్ధి పొందాలని చూస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కుల మతాలకు అతీతంగా మానవత్వం, సౌభ్రాతృత్వంతో కలిసి మెలిసి ఉంటారని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 304 ఎంపీ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ తనకు కెటాయిస్తే 2 లక్షల మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు.

లాల్‌బజార్ మహంకాళి ఆలయాన్ని కబ్జా చేస్తే సహించేది లేదు : మురళీ, సరిత

లాల్‌బజార్ మహంకాలి ఆలయ పరిరక్షణ వేధికలో ప్రసంగిస్తున్న మురళీ ముదిరాజ్, బిజెపి నాయకురాలు నాగినేని సరిత తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
కంటోన్మెంట్ 7వ వార్డులోని లాల్ బజార్‌లోని చౌరస్తాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహంకాలి ఆలయ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మురళీ ముదిరాజ్, బిజెపి నాయకురాలు నాగినేని సరితలు తెలిపారు. బుధవారం రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయ స్థలాన్ని కొందరు వ్యక్తులు రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులకు ముడుపులు చెల్లించి ఆయా స్థలాలను రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులకు రిజస్ట్రేషన్ చేసిన అధికారులపై,ఆలయ నస్థలాన్ని అక్రమించుకునేందుకు చదును చేస్తున్నభూ కబ్జా దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లాల్‌బజార్ ప్రజలకు పార్టీలకు అతీతంగా ఉద్యమించాలన్నారు.కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలి : భాగ్యశ్రీ

కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులుప్యారసాని శ్యామ్‌కుమార్, భాగ్యశ్రీ తెలిపారు. మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 7వ వార్డు పెద్ద కమేళాలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

ఘనంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం శంకుస్థాపన..

ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్‌లో గల బాలాజీ నగర్‌లో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్, కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరారావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గూడెపు నాగరాజు, గొట్టిముక్కల భాస్కర్‌రావు, సాదుప్రతాప్‌రెడ్డి, ఆలయ ఫౌండర్, చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, ట్రెజరర్ చిత్త భాస్కర్, సెక్రటరీ ప్రభాకర్, సతీష్, జగదీష్, సింగంశెట్టి రాజు, సునీల్, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి నాయకులు కాంగ్రెస్‌లో చేరిక..

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బి డివిజన్‌కి చెందిన ఐఎన్‌టియుసి కార్మిక విభాగం నాయకులు మామిళ్ళ ఆనంద్ నాయి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆనంద్‌కి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ తరపున స్వాగతం పలుకుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మేకల మండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా : తలసాని

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేకల మండి ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, హెచ్.ఎం.మల్లికార్జున్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
మేకల మండి ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ప్రత్యేక 65 లక్షల రూపాలయ నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఆ పాఠశాల సాధన కమిటీ సభ్యులు జర్నలిస్టు ఇ.చంద్రశేఖర్,శేషగిరి రావు, నర్సింగ్‌రావ్, హెడ్ మాస్టర్, మల్లికార్జున్ రెడ్డిలు గురువారం సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. పాఠశాల అభివృద్ధికి గతంలో కోటీ 80 లక్షలు మంజూరుచేయడం జరిగిందని ఆయన తెలిపారు. పెండింగ్ పనుల అభివృద్ధికి ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపి నిధులు విడుదల అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

లష్కర్‌ను జిల్లాగా మార్చాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు వినతి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
లష్కర్ జిల్లా సాధన కోసం తాము చేపట్టే పోరాటానికి మద్దతును ఇవ్వాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాలతో నూతనంగా లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో ఏర్పాటైన జిల్లా సాధన సభ్యులు గురువారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ జిల్లా పరిధి విస్తరించిన కారణంగా పరిపాలన సౌలభ్యం కోసం లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 40 జీహెచ్‌ఎంసీ డివిజన్‌లు నూతన జిల్లా పరిధిలో ఉన్నాయని వివరించారు. తమ పోరాటంలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నుండి గెలుపొందిన కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న జి. కిషన్‌రెడ్డి హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులతో పాటు ఈ ఏడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను కూడా కలిసి వినతిపత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. లష్కర్ జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళతామని చెప్పారు. నూతన జిల్లా ఏర్పాటయ్యే వరకు అన్ని వర్గాల భాగస్వామ్యంతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యాక్రమంలో సమితి ప్రధానకార్యాదర్శి సాదం బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, మిట్టపల్లి బాబురావు, రవీందర్‌సాగర్, కృష్ణ, అశోక్, సునిల్ ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

భారతీయ సంస్కృతికి ప్రతిబింబం సంస్కృతం : సంస్కృత అకాడమీ డైరెక్టర్ ఆచార్య నీలకంఠం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :
ప్రాచీనకాలం నుండి భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా సంస్కృతం నిలిచిందని సంస్కృత అకాడమీ సంచాలకుడు ఆచార్య కొళొజ్జల నీలకంఠం అన్నారు. తెలుగు భాష, సాహిత్య వికాసానికి విశేష కృషిచేస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా వేదాలంకార ఆచార్య ముదిగంటి గోపాల్‌రెడ్డి సాహితీ పురస్కార ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. బొగ్గులకుంట సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, ప్రాచీన వ్రాతప్రతుల గ్రంథాలయం పూర్వ సంచాలకుడు ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం, ప్రముఖ రచయిత్రి, పరిశోధకురాలు డా. ముదిగంటి సుజాతారెడ్డి తదితరులు పాల్గొని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కె.నీలకంఠంకు ముదిగంటి గోపాల్‌రెడ్డి సాహితీ పురస్కారం, 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రదానం చేశారు. సంస్కృతానికి భారతదేశం పుట్టినిల్లే అయినా విదేశీయులు మనకంటే ఎక్కువగా సంస్కృతాన్ని అధ్యయనం చేస్తున్నారని శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో అన్నారు. అయితే ఇతర భాషలకంటే సంస్కృతాన్ని అక్కున చేర్చుకొన్నది తెలుగుభాషేనని ఆనందాన్ని వ్యక్తపరిచారు. చెన్నయ్య సభకు స్వాగతం పలుకగా చివరిగా సాహితీ పురస్కార స్వీకర్త కె.నీలకంఠం ఆధునిక కాలంలో సంస్కృత భాష ప్రాధాన్యం అనే అంశంపై సవివర ప్రసంగం కావిస్తూ సంస్కృతాన్ని అధ్యయనం చేస్తే పలు శాస్త్రాలలో అవగాహన ఏర్పడుతుందని, అందుకే కేంద్రప్రభుత్వం నూతన విద్యా విధానంలో సంస్కృతానికి విశేష ప్రాధాన్యతనిచ్చిందని తెలిపారు.

నీలకంఠంను సాహితీ పురస్కారంతో సత్కరిస్తున్న శివారెడ్డి, సుబ్రహ్మణ్యం, సుజాతారెడ్డి, చెన్నయ్య

విద్య సామాజిక న్యాయరంగాల్లో పూలే సేవలు చిరస్మరణీయం : వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

ఒ.యూలో పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వీసి ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ

తార్నాక, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
విద్య, సామాజిక న్యాయం, సమానత్వం కోసం మహాత్మా జ్యోతిబాపూలే సేవలు ఈ తరానాకి ఆదర్శమని వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాత్మ జ్యోతి బాపూలే రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ.రవీందర్ మాట్లాడుతూ సామాజిక సాధికరత కోసం పూలే ఆశయాలను కొనసాగించాలన్నారు. సాధికారత, కోసం పాటుపడ్డ పూలే ఖ్యాతిని గౌవరించుకోవడం కోసం విగ్రహావిష్కరణ మైలు రాయిగా నిలుస్తుందన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే రీసర్చ్ సెంటర్, బీసీ సెల్ డైరెక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో సమగ్ర, సాధికారత లక్ష్యంగా కృషి చేయాల్సిన అసరం ఉందన్నారు.ఇందుకోసం తమకు మద్దతుగా నిలుస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంకు, ఫ్యాకల్టి సభ్యులకు కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, మైనార్టీ సెల్ డైరెక్టర్ డా. సయ్యదా అజీమున్నీసా, బిఆర్‌అంబేద్కర్ రీసర్చ్ సెంటర్, ఎస్సీ,ఎస్టీ, సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు తదితరులు పాల్గొన్నారు.

-ఒ.యూలో పూలే విగ్రహ ఆవిష్కరణ

మణికొండ మున్సిపల్‌లో వీగిపోయిన అవిశ్వాసం

- హాజరుకాని చైర్మన్, ఆయన వర్గం

- అవిశ్వాసంకు హాజరైన 10.మంది కౌన్సిలర్లు

నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :
మణికొండ మున్సిపాలిటీలో 10.మంది కౌన్సిలర్లు చైర్మన్ కస్తూరి నరేందర్‌పై పెట్టిన "అవిశ్వాసం" వీగిపోయింది. ఈ మున్సిపాలిటీలో మొత్తం 20.మంది కౌన్సిలర్లు ఉండగా, 13.మంది కౌన్సిలర్లు అవిశ్వాసం సమావేశంకు హాజరవ్వాల్సి ఉంది. కానీ 10.మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరవడంతో అధికారులు అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. అధికారులు అధికార పార్టీ ఒత్తిడితో మాకు సమయం ఇవ్వలేకపోయారని, దీని వల్లనే మేము చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని కౌన్సిలర్లు తెలిపారు. అవిశ్వాసంలో మేము గెలుస్తామని భయపడ్డ చైర్మన్ నరేందర్ ఈ సమావేశానికి హాజరు అవ్వలేదని, గోవాలో క్యాంపు రాజకీయాలు నడుపుతున్నాడని ఆరోపించారు. తమకు పూర్తి మద్దతు లేకపోయినా కౌన్సిలర్లు అవిశ్వాసానికి వెళ్లి అబాసుపాలయ్యారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మొదట కేవలం 8.మంది సభ్యులు రావడంతో అధికారులు సమావేశంను 12:30.గంటలకు వాయిదా వేశారు. అప్పుడు కేవలం 10.మంది మాత్రమే వచ్చారు. కోరం లేకపోవడంతో అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు నవీన్, శైలజ, పద్మారావ్, వందన నాగేష్, హైమాంజలి, కావ్యశ్రీరాములు, నాగలక్ష్మీ, శ్వేతలు సమావేశం గది నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీలో మెజారిటీ మావైపే ఉందని, ఇకపై చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను సాగనివ్వబోమని హెచ్చరించారు. ప్రజలకు మేలు చేసే అభివృద్ధి పనులు మాత్రమే జరిగేలా చూస్తామని, అడ్డగోలు నిర్ణయాలకు చెక్ పెడ్తామని స్పష్టం చేశారు.

అవిశ్వాసం వీగిపోయిన తరువాత మణికొండ మున్సిపల్ కార్యాలయం ముందు నిల్చున్న కౌన్సిలర్ల దృశ్యం

పై'చేయి' సాధించిన చైర్మన్ నరేందర్ :

మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ నరేందర్ ముదిరాజ్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయేలా చేసి, ఇక్కడ నాదే పై'చేయి' అని నిరూపించుకున్నాడు. తనపై పెట్టిన అవిశ్వాసం వీగిపోతుందని మొదటి నుంచి ఆయన తన అనుచరగణంతో చెబుతూనే ఉన్నారు. చివరికి ఆయన మాటలే నిజమయ్యాయి.

అక్రమ కట్టడాలపై అధికారులు కన్నెర్ర..

-ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో గుర్తించిన అక్రమకట్టడాలు..

-కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ మున్సిపల్ యంత్రాంగం..

-అక్రమ కట్టడాలు కూల్చివేత..

ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్న అధికారులు

దుండిగల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అక్రమ కట్టడాలపై ఎట్టకేలకు రెవెనూ , ఇరిగేషన్, మున్సిపల్ అధికార యంత్రాంగం కదిలింది. అక్రమ కట్టడాలను గుర్తించిన అధికారులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గురువారం దుండిగల్ చిన్నదామర చెరువులో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అక్రమ కట్టడాలను పోలీస్‌ల భారీ బందోబస్తుతో కూల్చివేశారు.

అధికారాన్ని అడ్డంపెట్టుకుని..

మాజీమంత్రి మల్లారెడ్డి అల్లుడు మల్కాజగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని దుండిగల్ మున్సిపాలిటీ, దుండిగల్ గ్రామం సర్వే నెంబర్ 405, 482, 484, 486, 488, 492లో గల లేకబడి 2811 చిన్నదామర చెరవును ఆక్రమించి సుమారు 20 ఎకరాల బఫర్, ఎఫ్‌టిఎల్‌లో శాశ్వత భవనాలు, షెడ్లు, పార్కింగ్, ప్లేగ్రౌండ్ నిర్మాణాలను అడ్డదారిలో చేపట్టడంతో గుర్తించిన అధికారులు వాటిని గురువారం నేలమట్టం చేశారు.

మర్రి అక్రమాలకు ముక్కుతాడు

2007లో హైకోర్ట్‌లో నమోదైన కేసులలో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని 13 చెరువులను పరిశీలించిన ప్రత్యేక న్యాయనిపుణుల కమిటీని ఏర్పాటు చేందింది అందులో భాగంగా హైకోర్ట్ ఆదేశాలమేరకు డిప్యూటీ సోలిసిటరీ జనరల్ ఆఫ్ ఇండియా ప్రవీణ్ కుమార్, గవర్నమెంట్ ప్లీడ్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాలతో గత వారంలో తనిఖీలు నిర్వహించింది. పత్రికలలో వరుస కథనాలతో స్పందించిన అధికారులు మర్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించడంతో అక్రమ కట్టడాలకు ముక్కుతాడు వేసినట్లు అయ్యింది. ఏరోనాటికల్ కాలేజీలో ఎఫ్‌టిఎల్ బౌండ్రీలను ఏర్పాటు చేశారు.

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా రాజేంద్రప్రసాద్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్(డిసిఎల్)గా రాజేంద్ర ప్రసాద్ గురువారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం రాజేంద్రప్రసాద్ నల్లగొండ జిల్లాలో విధులు నిర్వహించగా ప్రస్తుతం ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి బదిలీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన శ్యామ్‌సుందర్ జాజు నల్లగొండకు బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని, కార్మిక సంఘాలు,యూనియన్‌లు సహకారం అందించాలన్నారు.

కత్తితో పొడిచి రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్య

ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : పాత కక్షలతో రియల్ ఎస్టేట్ వ్యాపారిని పథకం ప్రకారం నిర్మానుషంగా ఉన్న ప్రాంతానికి పిలిపించి కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఆదర్శనగర్‌కు చెందిన పుస్తకాల శ్యామ్‌లాల్ కుమారుడు పి.సాయికుమార్ 43 సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలో ఉప్పల్‌లో ఉంటూ కారు క్రయ విక్రయాలు చేస్తుంటాడు. ఇదే క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి కూడా దిగినట్లు స్థానికులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఉప్పల్ జెన్‌ఫ్యాక్ వద్దకు రమ్మని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి పిలిపించారు. అనంతరం అతనితో గొడవ పడి కత్తితో తీవ్రంగా గాయపరిచి నిందితులు పరారైనట్లు తెలిపారు. గాయపడిన సాయికుమార్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. పాత కక్షలతోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు పలు కోణాలతో కేసు విచారిస్తున్నారు. మృతుడి సోదరుడు పి.సాయికిరణ్ ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్టు..

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
విద్యార్థులను టార్గెట్ చేస్తూ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఎస్‌ఓటి టీం బాలానగర్ పోలీసులు కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఐడిపిఎల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు విద్యార్థులు ఉన్న ప్రాంతానికి వెళ్ళి గంజాయిని విక్రయిస్తున్నారు. పక్క సమాచారం అందుకున్న ఎస్‌ఓటి పోలీసులు బాలానగర్ పోలీసులు కలిసి బుధవారం రాత్రి ఐడిపిఎల్ ప్రాంతంలో దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 45వేల రూపాయల విలువ గల మూడు గ్రాముల గంజాయినీ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నిందితుల నుండి మూడు సెల్‌ఫోన్లు, బైకును రికవరీ చేసుకున్నారు. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిబ్రవరి 25న బాచుపల్లిలో సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక..

మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రకటన..

నిజాంపేట్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సెక్రటరీ జగదీశ్వర్ యాదవ్ ఆదేశాల మేరకు పురుషుల 70వ సీనియర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షిప్ 2024 మార్చి2 నుంచి 4వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో నిర్వహిస్తున్నారని జిల్లా సెక్రటరీ కాసాని వీరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజగిరి జిల్లా సీనియర్ పరుషుల కబడ్డీ జట్టు ఎంపికలు ఫిబ్రవరి 25 ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు బాచుపల్లి కాసాని కబడ్డీ అకాడమీలో జరుగుతాయని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జిల్లా సెక్రటరీ కాసాని వీరేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ ఎంపికలలో పాల్గొనదలచిన అభ్యర్థులు మేడ్చల్ మల్కాజగిరి జిల్లా స్థానికత కలిగిన అభ్యర్థులై ఉండాలని, 85 కిలోల బరువు కలిగి ఉండాలని, ఆధార్‌తో పాటు 2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలను జతచేయాలని పేర్కొన్నారు. ఎంపికైన మేడ్చల్ మల్కాజగిరి జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పురుషుల పోటీలలో 2024 మార్చి2 నుంచి 4వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో పోల్గొంటుందని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారం కోసం చంద్రహాస్ 9908205333, షకీల్ 7396749998లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విశ్వవ్యాప్తంగా వంశీరామరాజు చేస్తున్న సేవలు ప్రశంసనీయం

-మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్.విద్యాసాగరరావు

వంశీ రామరాజును సత్కరిస్తున్న మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్.విద్యాసాగరరావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు విశ్వవ్యాప్తంగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్.విద్యాసాగరరావు అన్నారు. వంశీ సంస్థ పలు తెలుగు గ్రంథాలను ప్రచురించడం జరిగిందని గుర్తు చేశారు. తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ అక్షరయాన్ అధినేత్రి ఇనంపూడి లక్ష్మి నిర్వహణలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుకు భాషకు సేవకు గుర్తింపుగా అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతఉఊ వంశీ రామరాజు తెలుగు భాషా రచయితలు, రచనలు వంశీ ప్రచురణలు ద్వారా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆయన భాషకు చేస్తున్న సేవకు గుర్తింపుగా ఆదరణ సత్కరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ పాల్గొన్నారు. వంశీ రామరాజుతో పాటు ప్రముఖ కవి అందెశ్రీ, నేటినిజం పత్రిక ఎడిటర్ బైసా దేవదాస్, రచయిత్రి బండ సరోజిని, డాక్టర్ చెన్నమనేని పద్మజ తదితరులను సత్కరించారు.

24న యూఎస్ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్

**హైదరాబాద్,

మేకలమండి ఉన్నత పాఠశాల నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః
భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం రూ. 65లక్షలు అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సనత్‌నగరన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పాఠశాల సాధన కమిటీ సభ్యులు చంద్రశేఖర్, శేషగిరిరావు, నర్సింగ్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యయుడు మల్లికార్జున రెడ్డిలు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ తక్షణమే జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లా కలెక్టర్‌లకు సిఫారసు లేఖను రాశారు. కమిటీ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.27 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పోరేటర

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
కాచిగూడ డివిజన్‌లోని నింబోలి అడ్డాలో 27 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పోరేటర్ కన్నా ఉమారమేష్‌యాదవ్ కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, శిరీషాఓంప్రకాష్‌యాదవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మహిళా సాధికారతపై సదస్సు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః వెస్ట్ మారేడ్‌పల్లిలోని విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ ఆండ్ సైనెసస్‌లో ఈనెల 23న డిజిటల్ యుగంలో మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత అనే అంశంపై జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు కళాశాలపై చైర్మన్ వి. రాజశేకరన తెలిపారు. ముఖ్య అతిథిగా ఐపీఎస్ అధికారిణి డాక్టర్ సౌమ్య మిశ్రా హాజరవుతారని తెలిపారు.

25న మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటి విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 25వ తేదీన హిమాయత్‌నగర్‌లోని కెవి రెడ్డి ఆర్క్‌డ్‌లో భవన్‌లోని జాతీయ కార్యాయలంలో జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ప్రకటించబోతున్న తీర్పు, పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం బాధ్యులంతా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

24న శ్రీ త్యాగరాజస్వామి 177వ సంగీత ఆరాధనోత్సవం

మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :
తెలంగాణ ప్రభుత్వం భాషాసంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి 177వ సంగీత ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 24న నిర్వహించడం జరుగుతుందని గుడిమల్కాపూర్‌లోని శ్రీఅన్నమాచార్య ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి. రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలో రామదాసు సంగీత కళాశాల, సికింద్రాబాద్‌లోని శ్రీత్యాగరాజ సంగీత కళాశాల, రామ్‌కోఠిలోని సంగీత అధ్యాపకులతో పాటు విద్యార్థులు నగరంలోని విద్వాంసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత ఉద్యోగావకాశాలు పొందాలంటే నాణ్యమైన విద్య అవసరం

చిక్కడపల్లి,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: విద్యార్థులు ఉన్నత ఉద్యోగ వకాశాలు పొందాలంటే నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని న్యూట్రివిండ్ హెల్త్‌కేర్ వ్యవస్థాపకులు, సీఈవో విశాల్ మావూరి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో క్లినికల్ న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అంశంపై కార్యక్రమం నిర్వహించి 'లైఫ్ సైన్స్ విద్యార్థులకు అవగాహన' కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాల్ మావూరి మాట్లాడుతూ క్లినికల్ న్యూట్రిషన్ చదువుతున్న విద్యార్థులకు ఈ విభాగంలో ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయన్నారు. వీటిని సాధించేందుకు ఎలా కృషి చేయాలి, ఈ కార్యక్రమంలో కళాశాల న్యూట్రిషన్ విభాగం అధ్యక్షులు బి.అనూష, సిఆర్.కీర్తన, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆదాయం రూ.లక్ష46వేల743

లెక్కింపు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం హుండి లెక్కింపు గురువారం జరిగింది. నెల రోజులకుగాను ఆలయానికి రూ.లక్ష46వేల743 ఆదాయం లభించింది. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. అర్చకులు బుగ్గలక్ష్మీపతి శర్మ, కె.వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి, ఆచారి, శివ పాల్గొన్నారు.

'తెలుగు సినిమాకు జైజైలు సీడి ఆవిష్కరణ

చిక్కడపల్లి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ఇట్‌క్లా సంస్థ అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు రచించిన '91 వసంతాల తెలుగు సినిమాకు జెజైలు' గేయరూపక సీడీని ఇటీవల మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఇటటీవల ఆవిష్కరించిన సీడీని మాజీ ఎంపి, జయభేరి అధినేత ఎం.మురళీమోహన్‌కు అందించే కార్యక్రమం జరిగింది. తెలుగు సినిమా విశ్వవిజేతగా అవతరించిన శుభతరుణాన ధర్మారావు రూపొందించిన సంగీత రూపకం ఎంతో గొప్పగా ఉందని మురళీమోహన్ అన్నారు.

బిజెపి ప్రచార రథం ప్రారంభం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః
మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని తాడ్‌బండ్ శ్రీ ఆభయాంజనేయస్వామి దేవస్థానంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్క కొమురయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్రలో భాగంగా బీజేపీ ప్రచార రథాలకు వాహనాలపు జెండా ఊపీ ప్రారంభించారు.

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మల్క కొమురయ్య

లోడ్ పెరిగినా సరఫరాలో ఇబ్బంది రాకుండా చర్యలు : డిఈ హేమచందర్

ముషీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:
వేసవి కాలంలో సైతం ప్రజలకు ఇబ్బందులు కలుగ కుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు పటి ష్టమైన చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ సైఫాబాద్ డిఈ హేమచందర్ స్పష్టం చేశారు. గురు వారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని విద్యుత్‌శాఖ కార్యా లయంలో అశోక్‌నగర్, గాంధీనగర్, కవాడిగూడ సబ్‌డివిజన్ల సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశం లో ఆయన వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎదుర య్యే సమస్యలు, పరిష్కారాలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హేమచందర్ మా ట్లాడుతూ వేసవిలో 10 నుండి 15 శాతం లోడ్ పెరిగే అవకాశం ఉందని, ఒకవేళ 20 శాతం లోడ్ పెరిగినప్పటికీ విద్యుత్ సరఫరాలో ఇబ్బంది రాకుం డా టెక్నికల్‌గా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎక్కడా పవర్ ఔటేజస్ అనేవి లేకుండా అన్ని చర్య లు తీసుకున్నామని, ఎక్కడైనా చిన్నపాటి సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించటానికి 24 గంటలూ మా సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొ న్నారు. వేసవిలో ప్రజలెవ్వరికే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలన్నదే మా ప్రధాన లక్ష్యమని, అందుకే ఎంత డిమాండ్ పెరిగినా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, కావల్సిన పవర్ మాదగ్గర ఉందని స్పష్టం చేశారు. అధికారులు అందరూ కూడా రాత్రి 9 గంటల వరకు ఆఫీస్‌లలో ఉంటారని, అవసరమైతే ఇంకా ఎక్కువ సమయం కూడా ఉంటామని, సిబ్బందికి కూడా 9 గంటల వరకు పీక్‌లోడ్ డ్యూటీస్ ఉంటాయని, ఇప్ప టికే దీనిపై స్పెషల్ డ్యూటీ చార్ట్‌లు కూడా వేశామ ని, షిఫ్టుల ప్రకారం 24 గంటలూ మా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. ఎక్క డైనా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా లేదా ఇతర కారణాలతో విద్యుత్ సరఫరాలో ఇబ్బంది ఎదురైతే వెంటనే 1912కు కాల్ చేయవచ్చునని తెలిపారు. అదేవిధంగా ప్రజలు ఎవ్వరైనా విద్యుత్ పరంగా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూం నెంబర్ 949 1629047 లేదా 9490619759 లేదా 040- 23433248 నెంబర్‌లకు కాల్ చేయవచ్చునని సూచించారు.ఈ సమావేశంలో ఏడీఈ మక్సూర్, గాంధీనగర్ ఏఈ సుధామ, అశోక్‌నగర్ ఏఈ పవన్ కుమార్, కవాడిగూడ ఏఈ సత్యప్రసాద్, సబ్ ఇంజ నీర్ శేఖర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డిఈ హేమచందర్

జాజుల శ్రీనివాసగౌడ్‌కు భువనగిరి పార్లమెంట్ టిక్కెట్ కేటాయించాలి

-బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:
రెండున్న శతాబ్దాలుగా బీసీ సమస్యలపై పోరాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్‌కు భువనగిరి పార్లమెంట్ టిక్కెట్ కేటాయించాలని బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేశారు. గురువారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశంలో 60శాతం ఉన్న బీసీలు 75 సంవత్సరాలుగా వెనుకబడి ఉన్నారని, అడుగడుగునా బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు పాలితులుగా కాకుండా పాలకులుగా మారాల్సిన అవసరం ఉందని, తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకుగాను 8 స్థానాలను బీసీలకు కేటాయించాలని కోరారు. బీసీ ఉద్యమాలకు పర్యాయపదంగా ఉన్న జాజులకు అవకాశం ఇస్తే బీసీలను గౌరవించినట్లేనని అన్నారు. బీసీల ఆకాంక్షల మేరకు బీసీ గళం పార్లమెంటులో వినిపించటానికి జాజుల శ్రీనివాస్‌గౌడ్ వంటి నాయకులను పార్లమెంటుకు పంపాలని కాంగ్రెస్ అధిష్టానంకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు మాదేశి రాజేందర్, సాయినాథ్ సాగర్, ఓంసాయి, ప్రవీణ్, మహిళా నాయకురాలు ఆనందలక్ష్మి పాల్గొన్నారు.

స్త్రీలు అత్యంత శక్తివంతులు అర్థం చేసుకుంటే సామాజిక న్యాయం సాధ్యం

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:
దేశంలో కులం, మతం పేరుతో మనువాదం రాజ్యమేలుతూ విజృంభిస్తున్నదని అంబాసిడర్, ఐఎఫ్ఎస్ రిటైర్డ్ అధికారి వినోద్‌కుమార్ ఆరోపించారు. తాను భారతదేశ రాయబారిగా మన దేశం గురించి ప్రపంచంలోని ఇతర దేశాలకు చాలా గొప్పగా చెప్పెవాడినని, కాని ఇక్కడ భిన్నంగా కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత స్త్రీ శక్తి 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సైఫాబాద్‌లోని సామ్రాట్ కాంప్లెక్స్‌లో 'దళిత, ఆదివాసీ స్త్రీలు-సామాజిక న్యాయం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దళిత, ఆదివాసీ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం దళిత స్త్రీ శక్తి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. స్త్రీలు అత్యంత శక్తివంతులని, వారు తమ శక్తిని అర్థం చేసుకుంటే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ దళిత, ఆదివాసీ స్త్రీలు ఒకే వేదికగా ఏర్పడి 18 సంవత్సరాలు ప్రయాణించడం వారి ఆధ్వరంలో సంఘం బలోపేతమై అనేక కార్యక్రమాల ద్వారా తెలుగు రాష్ట్రాలలో గుర్తింపు పొందడం గర్వంగా ఉందన్నారు. గత 18 సంవత్సరాలుగా దళిత, ఆదివాసీ స్త్రీలను, బాలికలను చైతన్య పరచడం, వారిపైన జరుగుతున్న అత్యాచారాలను అంతమొందించాలని, న్యాయం వైపు ప్రయాణించి అనేక సంఘటనల్లో విజయం సాధించడం జరిగిందన్నారు. స్త్రీ, పురుష సమానత్వం సాధించే దిశగా జెండర్ ప్రచారోద్యమం చేయడం జరిగిందన్నారు. సామాజిక న్యాయం సాధించాలంటే విలువలతో కూడిన ప్రజాస్వామిక విలువలు రక్షింపబడాలని, ఇందుకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధారాణి, డా.గోపినాథ్, డాక్టర్ పద్మాకర్, నెల్లి రామకృష్ణ, చారులత, వినయకళ, రమణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న వినోద్‌కుమార్. చిత్రంలో ఝాన్సీ, సుధారాణి తదితరులు ఉన్నారు.

ఏసీపీకి శుభాకాంక్షలు తెలిపిన భాస్కర్‌రెడ్డి

ఏసీపీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్‌రెడ్డి

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
కూకట్‌పల్లి నూతన అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును గురువారం బిఆర్ఎస్ నాయకుడు పాపారాయుడు నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, భూషణం, నరసింహారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వం మోడీ ప్రభుత్వం

- ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ సుజాతపాల్



మీడియాతో మాట్లాడుతున్న సుజాతపాల్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
రైత్యు వ్యతిరేక ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని అమాయకులైన రైతులను కాల్చిచంపుతున్నారని ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ సుజాతపాల్ ధ్వజమెత్తారు. గురువారం గాంధీ భవన్‌లో రైతులు వారి న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఢిల్లీకి వెళ్తే వారిపై ఉక్కుపాదం మోపిన మోడీ ప్రభుత్వ తీరుపై జరిగిన పత్రికా, విలేకరుల సమావేశంలో సుజాతపాల్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగంలు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంటలకు కనీస మద్దతు ధరలను చట్టబద్ధం చేయాలని మోడీని కలవడానికి వస్తే ఒక యువ 20ఏళ్ళ రైతును మోడీ ప్రభుత్వం కాల్చిచంపిందని, న్యాయం కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తుంటే మోడీ రైతులను కాల్చు చంపుతున్నారని అన్నారు. ఇది భారత్ పాక్ సరిహద్దులో జరుగుతున్న యుద్ధం కాదని, ఢిల్లీ హరియాణా సరిహద్దులో అన్నదాతలు చేస్తున్న ఆందోళనల్లో రైతులపై మోదీ సర్కారు చేస్తున్న యుద్ధమని అన్నారు. గతంలో కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న నిరంకుశ మోడీ ప్రభుత ం ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికార మదంతో రైతులనికారుతో తొక్కించి అనేకమంది రైతుల ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యిందన్నారు. రైతన్నలకు కాంగ్రెస్ పార్టీ ఆసరాగా నిలుస్తుందని, మోడీ ప్రజా వ్యతిరేకంగా పాలన చేస్తున్నారని, ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధులు భవానీ రెడ్డి, వచన్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పురస్కారాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: వైఎస్ఆర్.మూర్తి చారిటబు ల్ ట్రస్ట్, హ్యాపి ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వ ర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు పురస్కారాలను ప్రదానం చేయబో తున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత వైఎస్ఆర్.మూర్తి వివరించారు. ఇతర వివరాలకు 9849569626 ద్వార ఇతర వివరాలు పొంద వచ్చన్నారు. నృత్యం, రీసర్చ్, సంగీతం, సాహిత్యం, ఆటలు, మెడిసిన్, ఇంజనీరింగ్, యాంకరింగ్, యాక్టింగ్, మోడలింగ్ రంగాలలకు నైపుణ్యత ప్రదర్శించిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు, మార్చి 5లోగా పూర్తి వివరాలు అందించాలన్నారు.

కళాకారులను సత్కరించడం మంచి సంప్రదాయం

త్రినాథరావును సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మల్లెల కల్చరల్ అసొసియేషన్ అధినేత్రి మల్లెల వసుంధర ఆధ్వర్యంలో శారదవరపుత్ర డాక్టర్ చింతలపూడి త్రినాథరావుకు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆత్మీయంగా సత్కరించే కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, గ్రీన్‌శక్తి ఫుయల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత వి.రవిబాబు, మోటివేషన్ స్పీకర్ తనికెళ్ళ రామకృష్ణ, శ్రీరామసాంస్కృతిక సేవాసంస్థ అధినేత గోర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని త్రినాథరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్లెల వసుంధర నిర్వహణలో 'విన్నవించుకోనా చిన్న కోరిక' పేరుతో సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు సుజారమణ, రామలక్ష్మి, శశిరేఖ భారతి, గోవిందలక్ష్మి, శోభాదేవి, జ్ఞానవల్లి, శివరామకృష్ణ, రవిశంకర్‌ఠాగూర్, బైరి శ్రీనివాస్, కొండూరి రవి, వివి.రమణ, అవినాష్ తదితరులు అద్భుతంగా గానంచేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాత్రిగా లక్ష్మీగోపాల్ వ్యవహరించారు.

ద్వాదశ జ్యోతిర్లింగ 23వ శివపూజ మహోత్సవ ఆహ్వానం..

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
శ్రీ భ్రమరాంభ మల్లికార్జున దేవస్థానము (చిన్న శ్రీశైలం) నల్లగుట్ట, గాజుల రామారం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజగిరి జిల్లాలో ద్వాదశ జ్యోతిర్లింగ 23వ శివపూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ మాఘ పౌర్ణమి శనివారం రోజున హోమం ఉదయం10 గంటల నుండి శివపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు కారుతో ఢీకొట్టి బాధితుడిని ఆస్పత్రిలో చేర్చి పరార్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః
గురువారం తెల్లవారుజామున బొల్లారం పరిధిలో వేగంగా కారు నడుపుతూ వచ్చిన ఓ వైద్యుడు తోపుడు బండ్లపైకి దూసుకువెళ్లాడు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉన్న పలువురు వెంటాడి కారును అడ్డగించి వైద్యుడిని పట్టుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి నగరంలోని ఓ ఆస్పత్రికి చెందిన న్యూరో సర్జన్ అని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సయ్యద్ పాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా తన ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తామని చెప్పి బాధితుడిని కారులో ఢీకొన్న వ్యక్తే తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పాషాను చేర్పించి అక్కడి నుంచి వైద్యుడు పరారయ్యాడు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని, బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు వాపోయారు.

భవనం డిమాలేషన్‌లో వ్యక్తి మృతి..

మూసాపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
నిర్మాణంలో ఉన్న ఓ ఇల్లు కూల్చివేత పనుల చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్‌పల్లి మూసాపేటలో మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్, తన పాత ఇంటిని బుధవారం కూల్చివేశారు. కూల్చివేతకు ముందురోజే ఆ ఇంటిలో అద్దెకు ఉన్న అందరినీ ఖాళీ చేయించారు. ఉదయం పాక్షికంగా కూల్చివేత పనులు చేపట్టగా, భోజన విరామ అనంతరం ఇంటిని పూర్తిగా కూల్చివేశారు. అయితే ఆ ఇంటిలో శ్రీకాకుళం, పాతపట్నంకు చెందిన స్వామిరెడ్డి (45) గత కొన్ని నెలలుగా ఒక్కడే రూం తీసుకుని ఉంటూ లేబర్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కొడుకు ఉన్నారు. కూతురికి పెళ్ళి అయ్యింది. కాగా గురువారం మద్యం మత్తులో ఖాళీ చేయించిన ఇంటికి వచ్చి లోన నిదిరించాడు. అతడు లోన ఉన్న విషయం తెలియకుండా ఇంటిని పూర్తిగా కూల్చివేయటంతో, స్వామిరెడ్డి శిథిలాల కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకునకన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తులో హైటెన్షన్ టవర్ ఎక్కిన మందుబాబు

-సురక్షితంగా కిందకు దింపిన పోలీసులు

మద్యం మత్తులో విద్యుత్ టవర్‌పైకి ఎక్కిన రాంబాబు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో జనసమ్మర్థం అధికంగా ఉండే బాలాపూర్ చౌరస్తాలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన స్థానికులతో పాటు అక్కడికి చేరుకున్న పోలీసులు సదరు మందు బాబును కిందకు రప్పించడానికి నానా తిప్పలు పడ్డారు. చివరకు పోలీసులే ధైర్యం చేసి టవర్ పైకి ఎక్కి చాకచక్యంగా మందు బాబును కిందకు దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాంబాబు అనే వ్యక్తి బుధవారం రాత్రి పీకలదాకా మద్యం సేవించి దాని మత్తులో బాలాపూర్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ టవర్‌పైకి ఎక్కాడు. అతడిని గమనించిన కింద ఉన్న వారు ఎంత నచ్చజెప్పినా దిగకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సైతం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులు ధైర్యం చేసి పైకి ఎక్కి సురక్షితంగా అతడిని కిందకు దింపారు. ఆ తర్వాత వివరాలు తెలుసుకొని న్యూసెన్స్ కేసును నమోదు చేశారు.

పేదలకు చేయూతనిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి : జగదీశ్వర్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త
ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజలకు చేయూతనిస్తుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నా రు. ఆల్విన్‌కాలనీ డివిజన్, పంచమి కాలనీ వాస్తవ్యులు ఏఎస్ జాన్సన్ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించి దాని ద్వారా మంజూరైన రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాలను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.

KARNATAKA RELIGIOUS & LINGUISTIC MINORITY PROFESSIONAL COLLEGES ASSOCIATION (Regd.)(KRLMPCA)
Flat No.143, 4th Floor, "SURYAMUKHI" Garden Apartments
#21, Vittal Malya Road, Bangalore-560 001. Ph: 080-4112 1233
Email: info@kmca.info

Online Application forms are invited from eligible candidates for admission to BE Courses in the Member colleges of the Association for the academic year 2024-25. The test will be held on **19.05.2024** at Bangalore, Tumkur, Mangalore and Gulbarga. Intending candidates may visit the website of the Association **www.kmca.info** for details of the test and seat selection process. Online Application may be downloaded from the Association's website only, with effect from **06.03.2024.**

Sd/- President
Sd/- Secretary

www.kmca.info

త

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గ దీప్‌లాల్‌పై కార్పొరేటర్ల అవిశ్వాసం

కలెక్టర్‌కు అవిశ్వాస లేఖను అందజేస్తున్న బిజెపి, కాంగ్రెస్ కార్పొరేటర్లు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్‌పై మెజార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటించారు. గత కొంతకాలంగా మేయర్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లతో పాటు స్వంత బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు ఎట్టకేలకు ఆమెపై అవిశ్వాసం పెట్టడానికి ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్ళిన వారు అక్కడ కలెక్టర్ శశాంకను కలిసి అవిశాస్వంపై లేఖను అందజేశారు. కలెక్టర్‌కు స్వయంగా లేఖను అందించినవారిలో బిజెపికి చెందిన కార్పొరేటర్లు రాత్లావత్ నీల రవినాయక్, మోడల బాలకృష్ణ సాగర్, మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, ముత్తంగి కరుణానిధి, కాంగ్రెస్‌కు చెందిన వేముల నర్సింహ, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, మొక్క నరేంద్రకుమార్‌లు ఉన్నారు. అయితే అవిశ్వాసం లేఖలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు సంతకాలు పెట్టినా కలెక్టర్‌కు అందజేసే సమయంలో మాత్రం సీన్‌లోకి రాలేదు. మొత్తం మీద చాలా రోజులుగా మేయర్‌పై అవిశాస్వానికి రంగం సిద్ధం చేసుకున్నా ముందడుగు మాత్రం పడింది. అయితే మేయర్‌ను పదవి నుండి తొలగించడానికి కావాల్సిన బలం కంటే తమకు ఎక్కువగానే ఉందని లేఖను అందజేసిన వారిలో కొందరు కార్పొరేటర్లు పేర్కొన్నారు.

సందిగ్ధంలో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం!

మేయర్ దుర్గ దీప్‌లాల్‌పై అవిశ్వాసం ప్రకటించిన మెజార్టీ కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిపై మాత్రం పెట్టలేదు. గురువారం కేవలం మేయర్‌పై మాత్రమే కలెక్టర్‌కు అవిశ్వాసం లేఖను అందజేయడం గమనార్హం. డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిపై అవిశ్వాసం పెట్టడానికి కొందరు కార్పొరే టర్లు సుముఖంగా లేనట్లు సమాచారం. ఒక వేళ విక్రంరెడ్డిపై అవిశ్వాసం పెడితే కొత్తగా డిప్యూటీ మేయర్ ఎవరనే విషయమై కొలిక్కి రాలేదని తెలుస్తోంది. ఏది ఏమైనా ఒకటి, రెండు రోజుల్లో ఈ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నూతన డీసికి కాంగ్రెస్ నేతల సత్కారం

డిసి సుజాతను సన్మానిస్తున్న ఉపేందర్ రెడ్డి, గణేష్ నేత

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సరూర్‌నగర్‌సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా భాద్యతలు స్వీకరించిన సుజాతను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్కె పురం కాలనీ పార్కులో వున్న పురాతన బావి పూడిక తీసి పునరుద్ధరణ కోసం నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం కాలనీ వాసులు రామారావు, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో ర్యాపిడో క్యాబ్ మహోత్సవం

సైదాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ర్యాపిడో క్యాబ్స్ ఆధ్వర్యంలో చంపాపేటలో క్యాబ్ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు గుంటుపల్లి పవన్ మాట్లాడుతూ నగర వాసుల ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంలో కెప్టెన్‌ల పాత్ర అభినందనీయమన్నారు. ప్రయాణీకులు సమయానికి తమ గమ్య స్థానాలకు చేరుకోవడంలో కెప్టెన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి దాదాపు 1500 మందికి పైగా కెప్టెన్లు హాజరయ్యారు. కెప్టెన్లకు వాషింగ్ మెషీన్లు, టెలివిజన్లు, కెమరాల వంటి బహుమతులను అందజేశారు.

విద్యారంగాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన మహనీయుడు అబ్దుల్ కలాం ఆజాద్

అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మలక్‌పేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో దేశంలో విద్య రంగాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన అబ్దుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు అల్లం భాస్కర్, గంటల కృష్ణ, భాస్కర్, చౌకి రవికుమార్, మహేష్ కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయి : నాచం సుధాకర్

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాచం సుధాకర్

మలక్‌పేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ హైస్కూల్ ప్రిన్సిపల్ నాచం సుధాకర్ పేర్కొన్నారు. చాదర్‌ఘాట్ లోని పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజల సౌకర్యార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసామన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బిల్‌కుస్ ఫాతిమా, అధ్యాపకులు కృష్ణమోహన్, హనుమాన్లు, రవీందర్‌రావు, ఫాతిమా, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార లైసెన్స్ తీసుకోని వారిపై కఠిన చర్యలు : కమిషనర్ సత్యనారాయణరెడ్డి

వ్యాపార లైసెన్స్ తీసుకున్నవారికి అభినందిస్తున్న కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: తుర్కయంజాల్ పురపాలక అభివృద్ధికి వ్యాపారస్తులు వ్యాపార లైసెన్స్ తీసుకొని సహకరించాలని కమిషనర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాపార లైసెన్స్ తీసుకోవాలని, లేని యెడల 50 శాతం పెనాల్టీ తప్పదన్నారు. వ్యాపారులకు పలుమార్లు చెప్పిన లైసెన్స్ దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం తుర్కయంజాల్‌లోని గల్ఫ్ ఆయిల్ లూబ్రికే ఇండియా లిమిటెడ్, అక్షర సిరి స్టిల్స్, శ్రీ సి బాబా సర్వీస్ స్టేషన్, వాసవి కిరాణం,శ్రీ చక్ర మోటర్స్, రుద్ర టైలర్స్, నకోడా హార్డ్‌వేర్ వారు స్వచ్ఛందంగా వచ్చి లైసెన్స్ తీసుకోవడంతో కమీషనర్ వారిని అభినందించారు, పలుమార్లు చెప్పిన కూడా లైసెన్స్ తీసుకొని నందిని రెస్టారెంట్, కెబి ఫర్నీచర్, మహోనీయ హాస్పిటల్, వైష్ణవి, బాలాజీ, కీర్తన కోల్డ్ స్టోరేజ్, అగ్ర స్వీట్స్, ఎస్‌విఆర్ ఫౌల్ట్రీ ఏక్యూప్మెంట్స్, కావ్య సెరిమిక్స్‌లు వారికి హెచ్చరిక నోటీసులు జారీచేసారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, వినయ్‌కుమార్, ఇఇ హరీష్, భానుమతి, పారిశుధ్య జవాన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దబావి సోదరులకు మాతృ వియోగం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో సీనియర్ నాయకుడు పెద్దబావి సమరసింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలకు మాతృ వియోగం కలిగింది. వారి మాతృమూర్తి గ్రామానికి చెందిన మహిళా రైతు పెద్దబావి పార్వతమ్మ వృద్ధాప్య అనారోగ్య కారణాలతో గురువారం కన్నుమూశారు. ఆమె పెద్ద కుమారుడైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెంది కొన్ని నెలలు కాకముందు పార్వతమ్మ కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అయితే గురువారం బడంగ్‌పేట్‌కు వచ్చిన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో పాటు పలువురు పార్వతమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం పెద్దబావి సోదరులను పరామర్శించారు.

వనస్థలిపురం ఏసీపీని కలిసిన నాయకులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: వనస్థలిపురం ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కాశిరెడ్డిని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ లక్ష్మారెడ్డి, 4వ వార్డు మాజీ కౌన్సిలర్ గంటఅనుపమ లక్ష్మారెడ్డి ఉన్నారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

హయత్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: హయత్‌నగర్ డిగ్రీ కళాశాల బౌతిక శాస్త్రఅధ్యాపకులు అవేష్ మొహియుద్దిన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. బౌతిక శాస్త్రంలో 'ప్రిపరేషన్ అండ్ కార్యరక్టరైజేషన్ ఆఫ్ పివిబి మ్యాట్రిక్స్ బేస్డ్ నానో కాంపోజిట్ ' అనే అంశంపై ప్రొఫెసర్ ఎన్.నరసింహులు గారి పర్యవేక్షనలో పరిశోధన చేసినందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు ఇంతాయాజుద్దిన్ ఫారుఖీ, ఎన్.సుబ్రమణ్యం తదితరులు అవేష్ మొహియుద్దిన్‌ను కళాశాలలో సన్మానించారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సాయి స్థలి సంయుక్త ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం వద్ద ఉన్న ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా వారి సహకారంతో 50 సంవత్సరాలు నిండిన మహిళలు, 60 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కాలనీవాసులు, గుడికి వచ్చిన భక్తులు, పారిశుధ్య కార్మికులు, జలమండలి సిబ్బంది పాల్గొనగా వారికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి, సమస్య వున్న వారిని నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, 54 మంది పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండవ గురువారం ఇదే స్థలంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సబ్యులు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్, విద్యాసాగర్, లక్ష్మీనారాయణ, రామ్మోహన్, సాయిస్థలి కమిటీ సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుల నియామకాలు చేపట్టాలి

సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న దంత వైద్యుల సమావేశం ఎల్‌బినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రబుత్వం గతంలో ఇచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 59లో అన్యాయంగా దంత వైద్యుల నియామకాన్ని తొలగించారని పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా వెలువరించబడిన జీవో ఎంఎస్ నెంబర్ 59 లో దంత వైద్యుల నియామకాలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. వీలైనంత త్వరగా సమస్యలపట్ల సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ గంధం శాంతికుమార్‌గౌడ్ డిమాండ్ చేసారు. సమావేశంలో యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు దుర్గం శ్రీనివాస్,నూకం బిక్షపతి, ఎండి రఫీఉద్దీన్, బొంకటి సుభాష్, వైద్యులు డాక్టర్ ప్రజ్ఞా, లావణ్య, కృష్ణవేణి, సన్నీ జన్ను, వసుమతియాదవ్, దంత వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

కుషాయిగూడ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : చర్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో వేసవిలో ఎలాంటి విద్యుత్ అవాంతరాలు ఎదురవకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా చర్లపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో హబ్సిగూడ సూపరిండెంట్ ఇంజనీర్, సైనిక్‌పురి డిఈలతో కలిసి సమావేశం నిర్వహించారు. డిమాండ్‌కు తగినంతగా విద్యుత్ సరఫరా చేసే సామర్థ్యం ఉందని ప్రజా ప్రతినిధులకు వివరించాలన్నారు. అవసరానికి తగినట్టుగా సరఫరాను పెంచుతున్నామని గణాంకాలతో సహా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలకు అనుగుణంగా చర్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో, సూపరిండెంట్ ఇంజినీర్లతో డివిజనల్ ఇంజినీర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ అధికంగా ఉందని, సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కా ప్రణాళికలు రూపొందించమన్నారు. వినియోగదారులు ఏమైనా ఫిర్యాదులు వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు

ఉప్పల్ నల్ల చెరువును పరిశీలిస్తున్న డిసి అంజనేయులు, ఎసిపి వెంకటరమణ

ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలో చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఉప్పల్ డిప్యూటి కమిషనర్ ఎన్.అంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ నల్ల చెరువు, రామంతాపూర్ చిన్న చెరువు, పెద్ద చెరువులను టౌన్‌ప్లానింగ్ ఎసిపి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, ఇతర సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిసి అంజనేయులు మాట్లాడుతూ ఉప్పల్ నల్ల చెరువు, రామంతాపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువులకు ఇప్పటికే పెన్సింగ్ వేశారని, చెరువులోకి ఆక్రమణలు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చేది లేదని, చెరువులను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రాజు, రవి, శ్రీనివాస్, విజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ ఉప కమిషనర్‌గా సుజాత

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం నూతన ఉప కమిషనర్ గా సుజాత బాధ్యతలు చేపట్టారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.

సరూర్‌నగర్ ఎక్సైజ్ సిఐకి సన్మానం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డిని గురువారం బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ గౌడ సహకార సంఘం నాయకులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకుడు కుంచ నాగేందర్‌గౌడ్ తదితరులు ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సానిటేషన్ సిబ్బందికి ప్రొఫైలింగ్ క్యాంపు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో గురువారం నేషనల్ ఆక్షన్ ఫర్ మెకానిజెడ్ సానిటేషన్ ఎకోసిస్టం (నమస్తే)పై ప్రొఫైలింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లయితే వారికి గుర్తింపు కార్డు లభించడంతో పాటు రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుండి పథకాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ జి.రఘు, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, ఆఫీస్ మేనేజర్ నాగేశ్‌బాబు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి స్టేట్ జాయింట్ సెక్రెటరీ కందుల ఉపేందర్ ఆధ్వర్యంలో ఎల్‌బినగర్ కొత్తగా ఏసిపి కృష్ణయ్యను కలిసిన సూర్యాపేట, ఖమ్మం అధ్యక్షులు మధు, ఎనమెల్ల ప్రభాకర్, అల్లం రాజారెడ్డి, సున్నపు నవీన్, సైదానాయక్, విజయ్‌రెడ్డి తదితరులు (మన్సూరాబాద్, ప్రభాతవార్త)

24న బిజెపి విజయ సంకల్ప యాత్ర

బిజెపి విజయ సంకల్ప యాత్ర సమావేశం వివరిస్తున్న బిజెపి సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, బాలచందర్ తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : బిజెపి విజయ సంకల్ప యాత్ర ఈనెల 24న ఉప్పల్‌కు చేరుకుంటుందని ఉప్పల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, మాజీ వైస్ చైర్మన్ గొరిగె కృష్ణ, సెన్సార్ బోర్డు మెంబర్ మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, అధికార ప్రతినిది పోతగాని గోపాల్‌గౌడ్, గోనె శ్రీకాంత్ ముదిరాజ్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి నేతృత్వంలోసాగుతున్న విజయ సంకల్ప యాత్ర ఈనెల 24న ఉప్పల్ నియోజకవర్గానికి చేరుకుంటుందని తెలిపారు. నాగోల్ నుంచి ఉప్పల్‌లోకి ప్రవేశించి ఉప్పల్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహిస్తామని, అక్కడి నుంచి రామంతాపూర్, స్ట్రీట్‌నెం.8 మీదుగా హబ్సిగూడ చౌరస్తాకు చేరుకుంటుందని తెలిపారు. ఉప్పల్ రింగ్‌రోడ్‌లో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశామని, రామంతాపూర్‌లో రెండు వేల మందితో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఉంటుందని, స్ట్రీట్‌నెం.8లో కెప్టెన్ వీర రాజిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. కేంద్రంలో బిజెపిని మరోసారి అధికారంలోకి తీసుకుని రావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర సాగుతుందని తెలిపారు. తెలంగాణలోని 17 నియోజకవర్గాలను క్లస్టర్లుగా విభజించి యాత్ర సాగిస్తున్నామని, ఈ యాత్రకు కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నేతృత్వం వహిస్తారని తెలిపారు. బిజెపి సీనియర్ నేతలు, మహిళ నేతలు పాల్గొంటారని, బిజెపి పార్టీ శ్రేణులు హజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

ముత్యాలరావు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన హౌసింగ్ సొసైటీ కార్యవర్గం

మల్కాజిగిరి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ముత్యాలరావు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ఈ నెల 20వ తేదీన డిస్ట్రిక్ట్ హౌసింగ్ సొసైటీ సబ్ రిజిస్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో 15 మంది పోటీ చేయగా ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ జర్నలిస్ట్ డి.లక్ష్మీనారాయణరెడ్డి విజయం సాధించారు. గెలుపొందిన వారితో సొసైటీ కమిటీ వేసి అధ్యక్షులుగా లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.వేలును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కే.ఉమేష్, కోశాధికారిగా డికృష్ణ దేవి, డైరెక్టర్లుగా కే వెంకటేష్, వై కొండలరావు, జేకే. జయశ్రీ, డి.పి.రామ్, ఆలా పూల ,ఏ రాధ, డి బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డి లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ ముత్యాలరావు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు : ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

కోర్టు నిర్మాణ నమూనా పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

నేరెడ్‌మెట్ ఫిబ్రవరి22 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో నిర్మించబోయే ఆర్.యూ.బి, ఆర్,ఓ,బి, మల్కాజిగిరి కోర్టు నిర్మాణ విషయాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మల్కాజిగిరి పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. కోర్టు నిర్మాణ నమూన పత్రాలను పరిశీ లించి రిపోర్టు, కాంట్రాక్టు అగ్రిమెంటు కాపీలను చీఫ్ జస్టీస్ కారస్పాండెంట్స్ కాపీలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు, భవనాల శాఖ అధికారులు ఈఈ సారంగపాణి, డిఇ భారతి, ఏఇ రమేష్, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు, దోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రకు తరలిరావాలి

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం విజయ సంల్ప యాత్ర వెళుతుందని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ యాత్రకు ముఖ్య అతిథులుగా జాతీ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డిలు హాజరవుతారని అన్నారు.

వైష్ణవి ప్రసాద్‌కు బ్రాహ్మణ సంఘం మద్దతు

వైష్ణవి ప్రసాద్ కు మద్దతు తెలుపుతున్న మునిపల్లి శ్రీనివాసరావు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైష్ణవి ప్రసాద్ కి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీవీఎస్ఎస్ఎస్) పూర్తి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆర్కేపురంలో జరిగిన సమావేశంలో సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు తెలియజేస్